గొల్లపూడి కాలమ్

పెడసరం

చాలా సంవత్సరాల క్రిందటే 'ఆడవారి మాటలకు అర్థాలు వేరులే' అన్నారు పింగళి నాగేంద్రరావుగారు పెళ్ళి చేసి చూడు సినీమాలో. ఆడవారు అవునంటే కాదని మనం అర్థం చేసుకోవాలి. కాదంటే అవునని లెక్క తీసుకోవాలి. ఈ జమాఖర్చులన్నీ మగాళ్ళందరికీ తెలిసిన రొమాంటిక్ లెక్కలు.

అయితే ప్రపంచం అంతటా యిలాంటి విపర్యయాలున్నాయి.ఇంగ్లీషు తల్లి ముందు ఆమె కూతుర్నో,కొడుకునో గట్టిగా ముద్దు పెట్టుకుంటే ఆవిడని పెట్టుకొన్నట్టే లెక్క. అది ఆమెకి  నచ్చితే ఆనందించవచ్చు. నచ్చకపోతే గూబ పగలగొట్టవచ్చు.

రోడ్డు మీద నడుస్తున్నప్పుడు– మీ ఆవిడని ఎవరయినా పలకరించి 'మీరు చాలా అందంగా వున్నారు' అంటే తప్పనిసరిగా మీరు ఆయన చొక్కా పుచ్చుకుంటారు. విదేశాలలో అలా మెచ్చుకోవడం ఓ మర్యాద. దానికి పరిచయమే అక్కరలేదు. అందానికో, ఆకర్షణకో ఎదుటి వ్యక్తి యిచ్చే కితాబు మాత్రమే అది. మరేమీ కానక్కరలేదు.

అమెరికాలో రెడింగ్ అనే చోట ఒక మాల్ ముందు నేనూ, మా ఆవిడా నిలబడి వున్నాం. ఒకాయన అటు వెళ్తూ ఆగి 'మీ చీర చాలా అద్భుతంగా వుంది' అని చెప్పి వెళ్ళాడు. అది అతని అభిరుచి, సంస్కారానికి చి హ్నం. అంతే– పోకిరీతనం కాదు.

మనం తలూపితే అవునని చెప్పినట్టు–మన దేశంలో. కాని గ్రీసు,బల్గేరియా, టర్కీ దేశాల్లో తలూపితే కాదు అన్నట్టు అర్థం. రేపు ఏ కుర్రాడయినా ఏ అమ్మాయి ముందయినా చెంప దెబ్బ తినే ముందు బల్గేరియా లెక్కలో తలూపానని చెప్పుకు తప్పుకోవచ్చు.

పసివాడిని తల మీద తడితే– ఆప్యాయతకీ,లాలనకీ చి హ్నం మన దేశంలో. కాని నేపాల్‌లో అవమానించినట్టు లెక్క. ఎందుకంటే శిరస్సు బౌద్ధమతం ప్రకారం భగవంతుడి దేవాలయం లాంటిది. దానిని తట్టడం దేవునిపట్ల మన అహంకారం చూపడం లాంటిది.

గుడ్‌బై చెప్పడానికి చేతిని గాలిలో ఆడిస్తాం మనం. రైలు స్టేషన్‌లో రైలు కదులుతూంటే వందల చేతులు గాలిలోకి లేస్తాయి. కాని చైనాలో మీరలా ఏ అమ్మాయి ముందయినా ఊపితే గొడవలో పడతారు. అలా చెయ్యి ఊపితే దగ్గరికి రమ్మని పిలిచినట్టు లెక్క. మరి రమ్మని పిలిస్తేనో? పొమ్మని చెప్పడానికి గుర్తు. ఇప్పుడు తమకు పింగళి నాగేంద్రరావుగారి పాట బాగా అర్థమయి వుంటుంది.

జపాన్‌లొ మనుషులు దిగులుగా,కోపంగా, లేదా మనసులో గందరగోళంగా వున్నప్పుడు చిరునవ్వు నవ్వుతారు. బాధకి అది గంభీరమైన 'ముసుగు'.

మరి క్రికెట్ ఆటగాళ్ళందరూ గ్రౌండులో  యిష్టంవచ్చినట్టు ఉమ్ముతూంటే నాకు పరమ చికాకుగా వుంటుంది. బ్రిటన్‌లో రోడ్లమీద ఉమ్మడం, పదిమంది ముందూ తేన్చడం చాలా అసభ్యకరంగా చూస్తారు. వింబుల్డన్ పోటీల్లో ఎవరూ ఉమ్మడం నేను చూడలేదు. బహుశా వారికీ విషయం తెలియజేస్తారేమో.

అయితే కొరియాలో సుష్టుగా తేన్చడం కడుపు నిండడానికి గుర్తు. ఎవరికయినా, ఎప్పుడయినా తేన్చే హక్కువుంది.

పోతే, మరొక జాతి వుంది-రాజకీయ నాయకులు. వారు ఉచిత విద్యుత్తు ఇస్తామని అంటే ఒక్క బల్బునే ఇస్తారని మనం గ్రహించాలి. జన్మ భూమితో మనల్ని ఉద్ధరిస్తారంటే మనకీ ఖర్చుంటుందని గుర్తుంచుకోవాలి.

'మీ సేవ చేస్తాను' అంటే మరో అయిదేళ్ళ దాకా మీ మొహం చూడను అని మనం అర్ధంచేసుకోవాలి.

'నా జీవితం దేశానికే అంకితం' అంటే తప్పనిసరిగా గడ్డో, గాదరో ఫలహారం చేస్తాడని సరిపెట్టుకోవాలి.

నాకనిపిస్తుంది- ఈ కొత్త జాతి గురించి అందమయిన పాట రాయడానికి మనం పింగళి నాగేంద్రరావుగారిని నష్టపోయామని.

(రచయితని www.gollapoodimarithorao.com లో కలుసుకొన వచ్చును)

dear sri ashokgaru
please includu a line of my website at the end of the column,so that i can get the feedback from our readers, as few people get in touch me quite often. this interaction will be useful to us eventually.
with regards
gollapudi maruthi rao.